| | |
|---|---|
| **Date:** 14.10.2022 | **Publication:** Eenadu |
| **Page no:** 22 | **Edition:** Hyderabad |
| **Headline : Engine Protection Cover** | |

# ఇంజిన్‌కు ధీమాగా...

**కారు.. మన జీవితంలో దీనికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. చాలామందికి ఇదొక ముఖ్యమైన ఆస్తి. తమ కారు ఎప్పుడూ సురక్షితంగా, మంచి స్థితిలో ఉండాలని కోరుకుంటారు. అందుకే, చిన్న నష్టం జరిగినా దానికి అయ్యే ఖర్చును భరించేందుకు పూర్తిస్థాయి వాహన బీమా పాలసీని తీసుకుంటారు. నిబంధనల ప్రకారం ప్రతి వాహనానికీ కనీసం థర్డ్ పార్టీ బీమా ఉండాల్సిందే. పూర్తి స్థాయి బీమా పాలసీకి అనుబంధంగా కొన్ని పాలసీలను జోడించుకోవడం ద్వారా మరింత ధీమాగా ఉండొచ్చు. ఇందులో 'ఇంజిన్ ప్రొటెక్షన్ కవర్' ఒకటి.**



అనుకోని ప్రమాదాలు, తుపానులు, వరదలు తదితర సందర్భాల్లో వాహనానికి నష్టం వాటిల్లే ఆస్కారం ఉంటుంది. ఇలాంటి దురదృష్ట సంఘటనల వల్ల సంభవించిన ఆర్థిక నష్టాన్ని వాహన బీమా భర్తీ చేస్తుంది. కారు వల్ల ఇతరులకు ఇబ్బంది ఏర్పడితే.. దాన్ని థర్డ్ పార్టీ బీమా ద్వారా చెల్లించవచ్చు. కారుకు అదనంగా రక్షణ కల్పించాలనుకుంటే అనుబంధ పాలసీలు (యాడ్ ఆన్ కవర్) తీసుకోవచ్చు.

కారులో ప్రధాన భాగం ఇంజిన్. మొత్తం కారులో ఇదే కీలకం. దీని ప్రాముఖ్యత దృష్ట్యా బీమా సంస్థలు ప్రత్యేక ఇంజిన్ ప్రొటెక్షన్ పాలసీలను అందిస్తున్నాయి.

## ఏమిటీ పాలసీ..

ఇంజిన్ రక్షణ అనేది సమగ్ర మోటార్ బీమా పాలసీతోపాటే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇంజిన్ పాడైనప్పుడు వాహనదారుడు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఇది కాపాడుతుంది. హైడ్రోస్టాటిక్ లాక్, చమురు కారడం, ఇంజిన్‌లోకి నీరు చేరడం వంటి సంఘటనల వల్ల ఇంజిన్ పాడయ్యే ప్రమాదం ఉంటుంది. దీంతోపాటు క్రాంక్ షాఫ్ట్‌లు, సిలిండర్ హెడ్, కనెక్టింగ్ రాడ్, పిస్టన్ వంటి భాగాల మరమ్మతుకు అయ్యే ఖర్చుకూ ఈ ఇంజిన్ ప్రొటెక్షన్ పాలసీ పరిహారం ఇస్తుంది.

థర్డ్ పార్టీ పాలసీ తీసుకున్నవారు ఈ అనుబంధ పాలసీని కొనుగోలు చేయడం సాధ్యం కాదు. సాధారణంగా బీమా సంస్థలు 10 ఏళ్ల లోపు వయసున్న కార్లకే ఈ యాడ్ ఆన్‌ను అందిస్తుంటాయి. ఈ నిబంధనలు బీమా పాలసీని బట్టి మారుతూ ఉంటాయి. ఈ అనుబంధ పాలసీని కొనేందుకు అదనంగా ప్రీమియం చెల్లించాలి.

## ఎవరికి...

మీ వాహనంలోని అత్యంత విలువైన భాగం ఇంజిన్. కాబట్టి, దీని రక్షణకు ఈ అనుబంధ పాలసీ తీసుకునే విషయాన్ని పరిశీలించవచ్చు. తరచూ వరదలు వచ్చే ప్రాంతాల్లో ఉన్నవారు దీన్ని తీసుకోవచ్చు. కొత్తకారును కొనేటప్పుడు మోటార్ బీమా కవరేజీని పెంచుకునేందుకూ ఈ యాడ్ ఆన్ ఉపయోగపడుతుంది.

- ఆదిత్య శర్మ
చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్, రిటైల్ సేల్స్,
బజాజ్ అలయాంజ్ జనరల్ ఇన్సూరెన్స్